సిద్దాపూర్ రిజర్వాయర్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

అభివృద్ధి పనులను అడ్డుకోవడం అవివేకం

ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

వర్ని, జనవరి 23: అభివృద్ధి పనులను అడ్డుకోవడం అవివేకమని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్ శివారులో చేపట్టిన సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. రెండు నెలల నుంచి పనులు నిలిచిపోయాయని ఈ సందర్భంగా రైతులు పోచారం దృష్టికి తీసుకొచ్చారు. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి మొరం తరలిస్తుండగా కాంగ్రెస్ నాయకులు వాహనాలను అడ్డుకుంటున్నారని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను అడ్డుకోవడం అవివేకమని, అంతా ఐక్యంగా ఉండి రిజర్వాయర్ పనులు కొనసాగేలా చూడాలని అన్నారు. పనుల పూర్తి కోసం బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజక వర్గాల్లోని రైతులు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్, అటవీ శాఖ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు.

పకడ్బందీగా సింగరేణి మెడికల్ బోర్డు ప్రక్రియ

- మోసగాళ్ల ఆటకట్టించేందుకు రంగంలోకి ఏసీబీ అధికారులు
- అక్రమాలకు పాల్పడితే డిస్మిస్
- సింగరేణి సీఎండీ హెచ్చరిక
- ఏసీబీ ఉన్నతాధికారులతో సమీక్ష

శ్రీరాంపూర్, జనవరి 23: సింగరేణి కార్మికులను వైద్యపరంగా పరీక్షించి ఇన్వాలిడేషన్ చేసే మెడికల్ బోర్డు ప్రక్రియను మరింత కట్టుదిట్టంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సీఎండీ ఎన్ బలరామ్ కీలక చర్యలు చేపట్టారు. కార్మికులను మాయమాటలతో మోసగిస్తున్న వారి ఆటకట్టించేందుకు ఏసీబీ అధికారుల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. ఇటీవలే ఏసీబీ డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసి విషయాన్ని ఆయనదృష్టికి తీసుకెళ్లారు. మెడికల్ బోర్డుపై ఏసీబీ కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఏసీబీ డీజీపీ ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ రమేశ్, నేతృత్వంలోని అధికారుల బృందం సోమవారం సాయంత్రం కొత్తగూడెంలో సీఎండీ బలరామ్‌ను కలిసింది. మెడికల్ బోర్డు ప్రక్రియపై ఏసీబీ అధికారులు, సింగరేణి అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎండీ బలరామ్ మాట్లాడుతూ.. మెడికల్ బోర్డు విషయంలో పైరవీలు చేయిస్తామని డబ్బు తీసుకున్న కొందరి విషయంలో, పైరవీలు చేయిస్తామని డబ్బు తీసుకున్న కొందరు ఉద్యోగులను ఇప్పటికే డిస్మిస్ చేసిన విషయాన్ని ఏసీబీ అధికారులకు వివరించారు. అలాగే ఇతరులు ఎవరైనా సరే కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు తమ దృష్టికి వస్తే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సంస్థ విజిలెన్స్ విభాగం కూడా మెడికల్ బోర్డుపై నిఘా పెడుతుందని చెప్పారు. మరింత పటిష్టమైన నిఘా ఉండాలన్న ఉద్దేశంతో ఏసీబీ సహకారాన్ని కోరుతున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీబీ ఉన్నతాధికారులు మాట్లాడుతూ సంస్థలో అనుమానాస్పదంగా ఉన్న ఉద్యోగుల కదలికలపై ప్రత్యేక నిఘా పెడుతామని చెప్పారు. కార్మికులను అన్‌ఫిట్ చేయిస్తామని ఎవరైనా డబ్బులు అడిగితే అలాంటి వారి సమాచారాన్ని ఏసీబీ దృష్టికి తీసుకురావాలని కోరారు. పారదర్శకంగా సింగరేణి మెడికల్ బోర్డు ప్రక్రియ జరగాలనే యాజమాన్యం ఆలోచనను సాకారం చేసేందుకు పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు.

అబ్బయ్య తాటిమోకుతో గౌడన్నకు రక్షణ

- నాణ్యమైన మోకుల తయారీలో ఫేమస్
- 25 ఏండ్లుగా వీటితోనే కుటుంబ పోషణ
- మరో ఐదుగురు కుటుంబసభ్యులకు ఉపాధి

తాటిమోకు తయారీలో నిమగ్నమైన అబ్బయ్య కుటుంబ సభ్యులు

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 23: తాటి చెట్టు పేరు వినగానే.. దాని నుంచి వచ్చే కల్లు తాగాలని, ముంజలు తినాలని మనసు కోరుకుంటుంది. మరి మనసు కోరిక తీరి జిహ్వ చాపల్యం చెందాలంటే.. గౌడన్నలు తాళ్లు ఎక్కాల్సిందే. ఆ గౌడన్నల ప్రాణాలు పదిలంగా ఉండాలంటే.. తాటిమోకులు దృఢంగా ఉండాలి. అవి నాణ్యంగా ఉండాలంటే.. అబ్బయ్య తాత నేసినవై ఉండాలంటున్నారు పలువురు గౌడన్నలు. తాటిమోకుల తయారీలో అబ్బయ్యది అందెవేసిన చెయ్యి అని, ఆయన దగ్గర కొంటేనే తమ ప్రాణాలకు భరోసా అని గీత కార్మికులు విశ్వసిస్తున్నారు. తాటిమోకుల తయారీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని 25 ఏండ్లుగా ఈ వృత్తిని కొనసాగిస్తూ.. తాను పొట్టపోసుకోవడంతో పాటు మరో ఐదుగురు కుటుంబసభ్యులకు జీవనోపాధి కల్పిస్తున్నాడు. ఇంతకూ.. ఎవరీ అబ్బయ్య? ఆయన తయారు చేసే తాటిమోకుల ప్రత్యేకత గురించి తెలుసుకుందాం.

గీత వృత్తిలో తాటిమోకుల పాత్ర కీలకం



జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన దూసరి అబ్బయ్యది నిరుపేద కుటుంబం. ఆయనకు ముగ్గురు కొడుకులు, కూతురు ఉన్నారు. ఇద్దరు కుమారులు రోడ్డు ప్రమాదంలో కాలం చేశారు. తొలుత కల్లు గీత పనిచేసేవాడు. తాళ్లు ఎక్కడంలో మోకుల పాత్ర కీలకమని, అది గట్టిగా ఉంటేనే గౌడన్నల ప్రాణాలు పదిలంగా ఉంటాయని గుర్తించాడు. చిన్నతనంలో తన తాత వద్ద నేర్చుకున్న మోకుల తయారీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. మోకుల తయారీ కోసం 15 రోజులకో సారి 5 క్వింటాళ్ల ప్లాస్టిక్ పొట్టెలు (ముడిసరుకు) కొనుగోలు చేస్తాడు. ఇందుకోసం రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు ఖర్చవుతుంది. వీటిని హైదరాబాద్ నుంచి తెప్పించుకుంటాడు. అబ్బయ్య భార్య భాగ్యమ్మ, కూతురు పులి సుమలత, కోడలు విజయ, బావ పూజారి రామస్వామి, అల్లుడు నర్సింహ కలిసి మోకులను తయారు చేస్తారు. సుమారు 2 గంటలకు ఒక మోకును తయారు చేస్తారు. అబ్బయ్య తయారు చేసిన మోకులు నాణ్యతతో కూడినవని గౌడన్నలకు నమ్మకం. అందుకే ఒక్క జనగామ జిల్లాలోని వారే కాకుండా.. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి గీత కార్మికులు అబ్బయ్య వద్ద తాటిమోకులు కొనుగోలు చేస్తుంటారు. ఒక్కో మోకును రూ.800కు కొనుగోలు చేస్తారు. ఇంకొందరైతే ఆర్డర్లు ఇచ్చి తయారు చేయించుకుంటారు. మోకులను అమ్మి అబ్బయ్య కుటుంబంలో ఒక్కొక్కరు రోజుకు సుమారు రూ.300 నుంచి రూ.500 వరకు సంపాదిస్తున్నారు. ఇలా 25 ఏండ్లుగా తాటిమోకులను తయారు చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తనతోపాటు ఐదుగురు కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పిస్తున్నాడు.

అబ్బయ్య వద్దే కొంటున్నం

నేను రోజుకు ఎనిమిది తాటిచెట్ల నుంచి కల్లు తీస్తుంట. మా ప్రాణాలకు భరోసా ఇచ్చేదే మోకు. మెషిన్‌పై మోకులు తయారు చేస్తారు కానీ.. అవి ఇంత నాణ్యతగా ఉండవు. ఎక్కువ కాలం పనిచేయవు. అవి ఎప్పుడు తెగిపోతాయోనని భయంగా ఉంటుంది. అబ్బయ్య తయారు చేసిన మోకులు చాలా కాలం పనిచేయడంతోపాటు నాణ్యంగా ఉంటాయి. అందుకే గీత కార్మికులు ఎక్కువగా అబ్బయ్య వద్దనే మోకులు కొంటరు. **–బత్తిని నర్సయ్యగౌడ్, ఉర్సు, వరంగల్**

ప్రభుత్వం ఆదుకోవాలి

ప్లాస్టిక్ పొట్టెలతో మొదట కల్లు కుండలకు ఉగ్గులు కట్టిన. అవి సంవత్సరం వరకు పని చేశాయి. దీంతో ప్లాస్టిక్ పొట్టెలతో మోకులు తయారు చేసి ముందుగా నేను వాడిన. మంచిగా ఉండటంతో మోకులు తయారు చేయడం మొదలు పెట్టిన. రెండేండ్ల నుంచి తాటిచెట్లను ఎక్కడం మానేసి పూర్తిగా ఈ మోకులను తయారు చేసి అమ్ముతున్న. ఈ పని చేయడం కష్టంతో కూడుకున్నది. ప్లాస్టిక్ పట్టీలను ముందుగా నారలా చీరి, వాటిని తాడులా పేనాలి. వాటిని మోకులా తయారు చేయాలి. అవి బలంగా తయారు కావడానికి, నున్నగా ఉండటానికి ఎక్కువగా శ్రమించాలి. నేను గీత కార్మికుడిని కాబట్టి మోకు పకడ్బందీగా తయారు చేస్త. అందుకే శాన మంది ఆర్డర్లు ఇచ్చి తయారు చేయించు కుంటాన్రు. ప్రభుత్వం మాకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

– దూసరి అబ్బయ్య, తాటిమోకుల తయారీదారుడు

సినీ డైరెక్టర్ త్రివిక్రమ్ దిష్టిబొమ్మ దహనం

- మార్క్స్, లెనిన్ పేర్లను విలన్లుగా చూపించారని ఆగ్రహం
- క్రిమినల్ కేసు నమోదు చేయాలని పీడీఎస్ నేతల డిమాండ్

గార్ల, జనవరి 23: గుంటూరు కారం సినిమాలో విలన్ పాత్రలకు మార్క్స్, లెనిన్ పేర్లు పెట్టి.. విలన్లుగా చూపించిన సినీ డైరెక్టర్ త్రివిక్రమ్ దిష్టిబొమ్మను మంగళవారం పీడీఎస్ నాయకులు దహనం చేశారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం మద్దివంచ గ్రామంలో నిరసన వ్యక్తం చేసిన నాయకులు.. డైరెక్టర్ త్రివిక్రమ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ నాయకులు మహేశ్, పవన్, సతీశ్, రామకృష్ణ, పృథ్వీరాజ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

భారీస్థాయిలో పౌరుల డాటా గల్లంతు

- ఫోర్బ్స్ కథనంలో వెల్లడి

వాషింగ్టన్, జనవరి 23: ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన కోట్లాది మంది పౌరుల వ్యక్తిగత డాటా లీక్ అయ్యిందని 'ఫోర్బ్స్' కథనం పేర్కొన్నది. ఇప్పటివరకు జరిగిన డాటా గల్లంతు ఘటనల్లో ఇదే అత్యంత పెద్దదని, ట్విట్టర్, డ్రాప్‌బాక్స్, లింక్డిన్, వీబో, అడోబ్, టెన్సెంట్, కాన్వా, టెలిగ్రామ్‌లలో యూజర్లకు సంబంధించి 2600 కోట్ల రికార్డులు గల్లంతయ్యాయని పేర్కొన్నది. 'సెక్యూరిటీ డిస్కవరీ', 'సైబర్‌న్యూస్'కు చెందిన పరిశోధకులు ఈ భారీ డాటా కుంభకోణాన్ని వెలికితీశారు. డాటా లీకైన దాంట్లో.. చైనాకు చెందిన టెన్సెంట్, వీబో, అమెరికా, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల సమాచారం ఉందని వారు చెప్పారు.

మనోళ్ల ప్రతిభకు కేంద్రమంత్రి ఫిదా

రిపబ్లిక్ డే క్యాంపులో భాగంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎన్‌సీసీ క్యాడెట్లు విశేష ప్రతిభ చూపారు. గ్రూప్ సాంగ్ విభాగంలో మనోళ్లు చూపిన ప్రతిభకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మంత్రముగ్ధులయ్యారు. అనంతరం ఆయన వేదిక మీదికెళ్లి క్యాడెట్లను అభినందించారు. – హైదరాబాద్, నమస్తే తెలంగాణ

సమావేశం ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తదితరులు

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కొత్త వ్యూహం

- అసెంబ్లీ సెగ్మెంట్లలో సోషల్ మీడియా వారియర్స్ ఏర్పాటు
- కాంగ్రెస్, బీజేపీల అసత్య ప్రచారాల కట్టడికి ప్రణాళిక
- నేడు కరీంనగర్‌లో ప్రారంభించనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్, జనవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని, వాస్తవాలను మరుగున పడేసేలా అబద్ధాలు, అసత్య ప్రచారాలతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్న కాంగ్రెస్, బీజేపీల ఆగడాలకు బ్రేక్ వేసేందుకు బీఆర్ఎస్ కొత్త వ్యూహానికి పదును పెట్టింది. ఇందుకోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో సోషల్ మీడియా వారియర్స్ పేరుతో కొత్త సైన్యాన్ని ఏర్పాటు చేస్తున్నది. ఇందులో భాగంగా బుధవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన సోషల్‌మీడియా వారియర్స్ సమావేశాన్ని కరీంనగర్‌లో నిర్వహిస్తున్నది. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే హైదరాబాద్‌లో సమావేశాలు నిర్వహించిన బీఆర్ఎస్.. బుధవారం నుంచి నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నది. ఇందులో భాగంగా తొలి సమావేశాన్ని కరీంనగర్‌లో ఏర్పాటు చేస్తున్నది. కరీంనగర్, మానకొండూరు, చొప్పదండి, హుజూరాబాద్, వేములవాడ, సిరిసిల్ల హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. కాగా సమావేశం ఏర్పాట్లను మాజీ ఎంపీ వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు.

సమతుల సేద్యం.. లాభాలు ఘనం

- భూమిలో సగం వరి పంట.. మరో సగంలో పండ్లు, ఆకు కూరలు, కూరగాయల సాగు
- సాగులో ఇబ్రహీంనగర్ రైతుల కొత్త ఒరవడి



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్‌లోని మిరప, కొత్తిమీర, బొప్పాయి, జామ, పసుపు, మామిడి

జగిత్యాల, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు పోరాటాలకు కేంద్రంగా పేరుగాంచిన జగిత్యాల కొన్నేండ్లుగా సేద్యంపై దృష్టి సారించింది. సంప్రదాయబద్ధమైన వరి పంటకు సంబంధించిన సాగు పద్ధతిలో నవ్య పద్ధతులను అవలంభించి, ఉత్పాదకతను ఇనుమడింపజేసిన జగిత్యాల.. ఇప్పుడు సమతల సేద్యం వైపు అడుగులు వేస్తున్నది. ఏ రంగంలోనైనా నవ్యతను, సవ్యతను ఆశించే జగిత్యాల ప్రాంత రైతులు సస్య రంగంలోనూ తమ ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. వరి పంటకు సమానంగా ఇతర పంటలను సాగు చేసే దిశలో ముందుకు సాగుతున్నారు. పూర్వం నుంచి ఉన్న మామిడి తోటలతోపాటు ఇతర ఉద్యాన తోటలను సాగు చేయడంపై దృష్టిపెడుతున్నారు. ఇప్పటికే జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన 300 మంది రైతులు కూరగాయలు, పండ్ల తోటలను సాగు చేస్తూ ముందుకెళ్తున్నారు. అదే మార్గంలో గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్ గ్రామ రైతులు ముందుకు కదులుతున్నారు.

సగం వరి.. సగం ఉద్యాన పంటలు

ఇబ్రహీంనగర్ గ్రామంలో ఉన్న సేద్య భూమిలో సగభాగంలో వరి పంట సాగవుతుండగా.. మిగిలిన సగంలో ఉద్యానవన పంటలు పండుతున్నాయి. స్వరాష్ట్ర ఏర్పాటు అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీరు, 24 గంటల కరెంట్ ఇవ్వడంతో సేద్య రంగం గణనీయస్థాయిలో వృద్ధి చెందింది. గతంలో బీడుగా ఉన్న భూములు సైతం తిరిగి సాగులోకి వచ్చిన విషయం తెలిసిందే. అలాగే, చాలా చోట్ల బీడు భూములను సాగు పొలాలుగా మార్చేశారు. అలాగే మామిడి తోటలు, నిమ్మతోటలను సైతం తొలగించి వరి పొలాలుగా మార్చిన విషయం అందరికీ తెలిసిందే. అయితే.. పర్యావరణ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు వరి విపరీతంగా సాగు చేయడం వల్ల సమస్యలు వస్తాయన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో.. వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించాలన్న ఆలోచనతో గ్రామాల్లోని సాగుభూమిలో యాభై శాతం వరి, మిగిలిన యాభై శాతం భూమిలో ఇతర పంటలను సాగు చేయాలని సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామ రైతులు నిపుణుల మాటలు విని, తమ గ్రామంలో సగం భూమిలో వరి, మిగిలిన సగం భూమిలో ఉద్యాన పంటలను సాగుచేయడం మొదలు పెట్టారు. వారిని అనుసరిస్తూ.. గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్ గ్రామ రైతులు సైతం ముందుకు కదులుతున్నారు. గ్రామంలో దాదాపు వెయ్యి ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా.. ఇందులో 450 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. 400 ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. మొదటి నుంచి మామిడి తోటలకు ఇబ్రహీంనగర్ పేరుగాంచినది. శతాబ్దాల కాలం నుంచి ఇక్కడ మామిడితోటలు సాగవుతూనే ఉన్నాయి. అయితే.. కొన్నేండ్లుగా మామిడి తోటల సాగులో మార్పులు వచ్చాయి. మేలు రకాలైన బంగినపల్లి, హిమాయత్, మల్లిక, దశేరీ రకాలకు చెందిన చెట్లను పెంచడం మొదలు పెట్టారు. ఇక గ్రామంలో ప్రస్తుతం పలు రకాల పండ్లు, కూరగాయల తోటలు గణనీయమైన విస్తీర్ణంలో సాగవుతున్నాయి. ఇక్కడ దాదాపు ముప్పై ఎకరాల్లో అరటి తోటలు కూడా ఉన్నాయి. అలాగే.. ఆయిల్ ఫాం, జామతోటలు (అలహాబాద్ సఫేద్, తైవాన్ రకాలకు చెందినవి) సీతాఫలం తోటలు, వాటర్ మిలన్, బొప్పాయి, వంగ, మిర్చి, టమాట, పసుపు, కొత్తిమీర వంటి పంటలు సాగవుతున్నాయి.

కోతులతో పంటలకు తప్పని సమస్యలు

ఆదర్శ సేద్యం సాగిస్తున్న ఇబ్రహీంనగర్ రైతులు తమకు అన్నింటికంటే కోతులే పెద్ద సమస్య అంటూ వాపోతున్నారు. ఈ గ్రామంలో రైతులు కూరగాయలు, పండ్ల తోటలను సాగు చేస్తున్న నేపథ్యంలో.. వీరు కోతుల సమస్యను అధికంగా ఎదుర్కొంటున్నారు. ఒకేసారి వందల సంఖ్యలో కోతులు గుంపులుగా పండ్లతోటలపైకి, కూరగాయల తోటలపైకి దాడికి వస్తున్నాయని, వాటిని తరిమేయడం పెద్ద సమస్యగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొదట్లో కోతులు పటాకుల శబ్దాలకు భయపడి పారిపోయేవని, కాలక్రమంలో అవి అలవాటు పడ్డాయని, దీంతో వాటిని తరమడం తలకు మించిన భారంగా మారిందని చెప్తున్నారు. ఈ క్రమంలోనే గతేడాది రైతులందరూ సమావేశమై పంటలను రక్షించుకునేందుకు రూ.2 లక్షల మేర చందాలు వసూలు చేసి.. నెల్లూరు నుంచి కోతులను పట్టేవారిని తీసుకువచ్చి పెద్ద సంఖ్యలో కోతులను బంధించి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టి వచ్చామని చెప్పారు. తర్వాత కొన్ని మాసాల వరకు ఇబ్బంది లేకుండా పోయిందని, అయితే.. మళ్లీ కోతులు వస్తూనే ఉన్నాయని వాపోతున్నారు. విధి లేని పరిస్థితుల్లో తోటల చుట్టూ కొందరు రైతులు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే, రైతులందరికీ కోతుల ఇబ్బంది ఉందని, వాటిని అరికట్టే మార్గం చూడాలని కోరుతున్నారు.

దళారి వ్యవస్థను అరికట్టాలి

దళారి వ్యవస్థను అరికట్టాల్సిన అవసరం ఉంది. జగిత్యాలలో మామిడి మార్కెట్ ఉంది. అయినా.. లాభం లేదు. దళారి వ్యవస్థ రాజ్యమేలుతున్నది. మామిడికాయలు తెంపుకొని మార్కెట్‌కు చేరే వరకు ధర మారిపోతున్నది. దళారులు తమకు నచ్చిన ధరకు సరుకును కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతు నష్టపోతున్నాడు. 34 ఏండ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నా. 3 ఎకరాల్లో వరి పండిస్తే, తొమ్మిదిన్నర ఎకరాల్లో మామిడితోట ఉంది. ఎప్పుడు మామిడికి సరైన ధర రావడం లేదు. రైతుకు పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. కోల్డ్ స్టోరేజీలు ఎక్కువగా నిర్మించాలి. పండ్ల తోటల రైతులకు ప్రయోజనం ఉంటుంది. లేకుంటే వ్యర్థమే.

–నేరెళ్ల రాజిరెడ్డి (ఇబ్రహీంనగర్)

ఇక్కడి రైతులు చైతన్యవంతులు

ఇబ్రహీంనగర్ రైతులు చైతన్యవంతులు. సంప్రదాయబద్ధమైన వరి పంటతో పాటు ఇతర అన్ని పంటలను సాగు చేసే విషయంలో ఎప్పుడూ ముందుంటారు. అలాగే.. వీలైనంతగా సమస్యలను పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తారు. గ్రామంలో వరి పంట విస్తీర్ణానికి సమాంతరంగా ఇతర కూరగాయలు, ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. పసుపు, మిర్చి, మక్క వంటి పంటలతో పాటు వాటర్ మిలన్, బొప్పాయి, జామ, కొత్తిమీర, బెండ, బీరకాయ, వంకాయ లాంటివి సైతం సాగు చేస్తున్నారు. జామ, సీతాఫలం తోటలు ప్రారంభమయ్యాయి. ఇటీవలి కాలం నుంచి రైతులు ఆయిల్‌ఫాం సాగుపై దృష్టి సారించారు. ఆయిల్‌ఫాంతో లాభాలున్నాయి. నాలుగేండ్లలోనే పంట చేతికి వస్తుంది. 90 శాతం సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం వస్తుంది. కోతుల బెడద ఉండదు. ఈ నేపథ్యంలో రైతులు ఆయిల్‌ఫాం సాగు వైపు పరిశీలిస్తున్నారు.

–మగ్గిడి స్పందన, హార్టికల్చర్ అధికారి, జగిత్యాల జిల్లా

కోల్డ్ స్టోరేజీలు అవసరం

పంటలు పండిస్తున్నాం కానీ.. ఏం లాభం. పెద్దగా ప్రయోజనం ఉండడం లేదు. 22 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నా. పదెకరాల్లో దొడ్డు రకం వరి సాగు చేస్తుంటే, మరో 12 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. వ్యవసాయం వారసత్వంగా వచ్చింది. బుద్ధి తెలిసినప్పటి నుంచి ఎవుసంపై మక్కువతోనే ముందుకు సాగుతున్నాం. అయినా.. అనుకున్నంతగా ప్రయోజనాలు రావడం లేదు. మా గ్రామంలో రైతులు చాలా ప్రోగ్రెసివ్‌గానే ఆలోచిస్తారు. కొత్త పంటలు పండించేందుకు, వరికి ప్రత్యామ్నాయ మార్గాలు వేసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. అయితే.. వారికి అనుకున్నంత సపోర్టు రావడం లేదు. కూరగాయలు, పండ్ల తోటలు సాగు చేస్తే.. కోతులతో పెద్ద ఇబ్బంది వస్తున్నది. రైతులకు మేలు కలగాలంటే కోతుల ఇబ్బందిని అరికట్టాలి. అలాగే.. ఇక్కడి నేలల రకాలపై రైతులకు అవగాహన కల్పించాలి. చాలా మంది నేలల రకాలు తెలియకుండా సేద్యం చేసి నష్టపోతున్నారు. నేలల రకాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు వివరించి నేలలకు అనుగుణమైన పంటలను సాగు చేసుకునేలా చెప్పాలి. పండించిన పంటను మార్కెటింగ్ చేసుకునే అవకాశం కల్పించాలి. ముందుగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. సేద్య ఆధారిత పరిశ్రమలు స్థాపించాలి. కోల్డ్ స్టోరేజ్‌లను నిర్మించాలి. అప్పుడే రైతుకు మేలు జరుగుతుంది.

– గుండేటి రాజిరెడ్డి (రైతు, ఇబ్రహీంనగర్)

కాళేశ్వరంపై ఎందుకంత అసత్య ప్రచారం?

- 90 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా అయితది?
- గత ప్రభుత్వాన్ని బద్నాం చేయడమే పనిగా పెట్టుకున్నరు
- మీడియాతో మాజీ మంత్రి కొప్పుల

మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల. మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 23: 'కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కాంగ్రెస్‌కు అక్కసు. గత ప్రభుత్వానికి ఎక్కడ పేరు వస్తుందోనని పూర్తిగా అసత్య ప్రచారం చేస్తున్నది. ఆ పార్టీ నేతలు నోరు తెరిస్తే అబద్ధాలే చెప్తున్నరు. రూ.90 వేల కోట్ల ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి ఎలా అయితదో? చెప్పాలి' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్‌కుమార్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, జడ్పీ చైర్‌పర్సన్ వసంతతో కలిసి మంగళవారం ఆయన జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్‌వన్నీ దొంగ వాగ్దానాలె. 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది. ఇప్పటివరకు చేసిందేమీ లేదు' అని మండిపడ్డారు.

వెంబడించిన కుక్కలు

తప్పించుకునే క్రమంలో బైక్‌తో ట్యాంకర్‌కు ఢీ • చికిత్స పొందుతూ యువకుడి మృతి

నవీన్ (ఫైల్)

గంభీరావుపేట, జనవరి 23: కుక్కలు వెంబడిస్తున్నాయని.. వేగంగా బైక్ నడపడంతో అదుపుతప్పి ఆగిఉన్న ట్రాక్టర్ ట్యాంకర్ ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్ తండా శివారులో చోటుచేసుకున్నది. లక్ష్మీపూర్‌తండాకు చెందిన ధరావత్ నవీన్ (23) సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో రాత్రి వేళలో గ్రామ శివారుకు చేరుకోగానే కుక్కలు వెంబడించాయి. వాటి బారినుంచి తప్పించుకునే క్రమంలో వేగంగా బైక్ నడపడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగిఉన్న ట్రాక్టర్ ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నవీన్ కరీంనగర్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

ఆస్తి కోసం చెల్లెలిపై హత్యాయత్నం

నిందితుడు సమ్మయ్య

వెంకటాపూర్, జనవరి 23: ఆస్తి కోసం మానవత్వం మరిచి దివ్యాంగురాలైన చెల్లెపై హత్యాయత్నం చేసిన ఘటన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక